# నదితీరాలు ::

రచన :
శ్రీ కృష్ణ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

ఇంటికి వెళ్ళలేదు. నదివెంటే నీళ్ళవంకచూస్తూ నడుస్తున్నాడు. తుమ్మడొంకల్లోంచి కొంతదూరం వెళ్ళి కొండవైపు మలుపుతిరిగాడు. ఉండవల్లి కొండ మీద సింహాలు రెండూ గర్జిస్తూ నిలుచున్నాయి. తనకు కనిపిస్తోందంతా ఒక్క అంధకారమే. చుట్టూ చీకటి అలుముకు పోయినట్టుంది. తను ఎక్కడికో సన్నటి గొంతులోకి - వెలుతురులేని సందులోకి చొరబడి పోతున్నట్టు - ఎక్కడినించో ఏదోశక్తి తన్నులాగేస్తోంది - పూర్తిగా శక్తికి తను నిలువలేకపోతున్నాడు అని మాత్రమే తనకు తెలుసు.

గుహల అంతస్థుల మెట్లన్నీ ఎక్కి - తరవాత బల్లిలా పాక్కుంటూ కొండ చివరికి చేరాడు. ఎప్పుడూ ఎవ్వరూ సామాన్యంగా ఎక్కని చివరికిపోయి కూచున్నాడు. ఒక్కసారి గట్టిగా ఏడ్చాడు - కళ్ళ నీళ్ళు తుడుచుకోకుండా ఏడ్చాడు... దాదాపు ఐదు నిముషాలు! తరువాత ఆకాశం వంక, పక్కనే పారుతున్న కాలువ వంకచూసి ఆలోచించడం మొదలు పెట్టాడు... ఈ కాలువ ఎక్కడినించి వస్తోంది? ఎక్కడికి పోతోంది? ...అది తనకు తెలియదు. ఇక్కడ ఈ సమయంలో పారుతున్న నీటిని మాత్రమే తాను చూస్తున్నాడు. అదే కాలువ అనుకుంటున్నాడు.

శశికి పెళ్ళయిందా? శశి ఎవరినో పెళ్ళి చేసుకుందా? పోనీ నన్నెందుకు పిలవగూడదు? పెళ్ళంటే ఎక్కడెక్కడి వాళ్ళనీ పిలుస్తారే-మర్యాదకోసమైనా.

పడమటి నీడలు తూర్పుకు తిరిగాయి. శేఖరం రాతికానుకుని అట్లాగే కూచున్నాడు. తన ముందు పడుతున్న నీడవంక చూసాడు. తనకు మూడింతలుంది. ఒక వస్తువుకి ఛాయ, ఒక నిజంలో అబద్ధం కూడా అంతే ఉంటుంది కాబోలు!...

పొద్దు వాటారింది. చుట్టూరక్తజ్యోతుల్లా మేఘాలు కదులుతున్నాయి. చీకటి చారలు బారలు చాచుకుని లోకాన్నంతా వెలుగునించి వేరుచేస్తున్నాయి.

కాలువలో నీటిస్పర్శ అతనికి చైతన్యమిచ్చింది. ముఖం మీద నీళ్ళుపోసుకున్నప్పుడు బుగ్గలమీద చారలు స్పష్టంగా చేతికి తగిలాయి. ఛీ! చేలలా ఇంత ఏడ్చేనా...? అనుకున్నాడు.

మెల్లిగా నదివంక నడిచాడు. మహానది కృష్ణ మందంగా బరువుగా తనలాగే నడుస్తోంది. వేగం హెచ్చించాడు. ఇంటి దగ్గర తనకోసం ఈ పాటికి మనుషులు బయలుదేరి ఉండాలి. పరీక్ష తప్పిన తన మిత్రులెందరో సాయంకాలానికి ఇల్లు చేరుకోవడం అతనికి తెలుసు.

## 4

బడి తెరిచారు! క్లాసులు క్రమంగా నడుస్తున్నాయి. శశి తప్ప తక్కిన ఆడపిల్లలంతా వచ్చారు. ఈ మధ్యనే ముందుకు మార్చుకున్న శేఖరం సీటు మళ్ళి ఆఖరికి చేరుకుంది. చిట్టచివరి మూలస్థానం అతనిది. అందులో విచిత్రమేమంటే తను క్లాసంతా చూడగలడు. క్లాసులో ఎవరూ తననుసరిగా చూడలేరు. ఎన్నోరోజులవరకు క్లాసులో కూచున్నంత సేపూ నీరసంగా వళ్ళు తిప్పుతున్నట్టుండేది శేఖరానికి. ఆడపిల్లల బెంచీ వంక ప్రమాదం వల్లనైనా సరే చూడకూడదనే నియమం జ్ఞాపకం పెట్టుకుని మరీ ఆచరించేవాడు.

శశిరాదని తెలుసు. పెళ్ళైన తరువాత చాలామటుకు ఆడపిల్లలు అంతే! శశిపెళ్ళి సంగతి స్కూలంతా తెలిసిపోయింది. శేఖరం శశిపక్కన నడుస్తుండడం భరించలేక పోతుండే చాలామంది అతడ్ని ఆటలు పట్టించడం మొదలు పెట్టారు. అందులో వివేకం మరీ ఎక్కువ. ఓకసారి శేఖరు పుస్తకం శశిదగ్గిరుండడం చూసి శేఖరం తనను అడిగి తీసుకోమన్నాడని అడిగాడు శశిని. అట్లాగైనా ఆమెతో మాట్లాడే భాగ్యం దొరుకుతుందని. దాని కామె చెప్పిన సమాధానం అతడెప్పటికీ మరచిపోలేదు.

శేఖరం ఆస్కూలు మార్చేసాడు! రెండు మైళ్ళ దూరంలో మరోస్కూల్లో చేరాడు. అక్కడంతా కొత్తవాళ్ళే. తన్నెరిగున్నవాళ్ళెవ్వరూ లేరు. అదే బావుంది అప్పటి పరిస్థితిలో అతనికి.

ఆ తరవాత ఎన్నోసార్లు వెళ్దామనుకున్నాడు శశి చూడడానికి. కాని ఒక్కసారి వెళ్లలేకపోయాడు. ఆమె తనకి తీరని ద్రోహంచేసిన అపరాధి. ఆమెను చూడడానికి ఎందుకు వెళ్లాలి? ఇంక నాకేముందని అక్కడ?

ఆరు నెలలు ఈ ప్రశ్న వేసి నిలబెట్టగలిగాడు మనసుని. కాని రోజురోజుకీ ఉరకలువేసి ముందుకు దుముకుతున్న ఆ శక్తిని మరి ఆపలేకపోయాడు. ఆ ప్రశ్నకి సమాధానం సిద్ధం చేసుకుందిప్పుడు. ఉంది. శశితో నీ సంబంధం చాలా ఉంది. ఇంచుమించు ఒక ఏడాది సన్నిహిత స్నేహం అట్లాగే ఉంది!

ఒక రోజు సాయంత్రం షికారు బైలుదేరాడు. అనకట్ట చూడగానే మెదడులో పొగలు బయలుదేరినాయి ఎన్నో ఆలోచనలు ఉంగరాల్లా తిరిగి అదృశ్యమై పోతున్నాయి. చూడగానే ఏమంటుందీ - అసలు పలకరిస్తుందో లేదో...

క్రిష్ణఆవలి ఒడ్డుచేరుకునే ఆ అరగంటలోనూ అతడిలోరేగిన మనోభావాలు వ్యాసుడు మహాభారతం గడగడా చెప్తుంటే ఘంటం ఆపకుండా రాసిన గణపతి దేవుడుగూడా వ్రాయలేడనుకుంటూ...

వసారలో అడుగుపెట్టాడు. అదేతోట, అదేఇల్లు, లోపలికి వెళ్ళేగుమ్మానికి పూసల అలంకరణ, అంతా అదే, తన్నుబాగా ఎరిగున్నదే. కాని ఇప్పుడంతా కొత్తగాఉంది - తను వాటన్నిటికీ ఎంతోదూరంలో ఉన్నట్టు.

వసారలో ఎవరులేరు. అట్లాగే నిలుచునిఉన్నాడు. ఒళ్ళంతా బరువై నేలలో కుంగిపోతున్నట్టుంది. వాళ్లమ్మ వచ్చింది. వస్తూనే ఆమె మొగంలో ఆశ్చర్యం, ఎవరన్నా ఎరిగున్నవాళ్లు కనిపిస్తే కలిగే కొంచెం సంతోషం కనిపించాయి "శశి నిన్నే వెళ్లిందోయ్ అత్తారింటికి. మీ బావగారికి కాకినాడలో సాల్టు ఇన్స్పెక్టరు పనయిందట" శేఖరానికి రెండూ వాక్యాలూ నిప్పులో కాల్చిన ఎఱ్ఱటి ఇనపసూదులు ఒంటిమీద దిగపొడిచినట్లున్నాయి. రెండవసూది ఇంకా లోతుకుదిగి కండలన్నీ కదుపుతూనేవుంది.

ఆమె ఇచ్చిన కాఫీ రెండు గుక్కలు మింగగలిగాడు. "మూడు నాలుగు నెల్లల్లోవస్తుంది. ఒకసారి చూసిపో. చాలా అనుకుంటుంది నిన్ను చూడాలని "గాలిలో తేలిపోయినాయి మాటలు." ఇదిగో శేఖరం. ఈసారి వచ్చినప్పుడు ఉత్తరం రాయిస్తాను. నీ ఎడ్రసు ఇచ్చిపోరాదూ?" శేఖరం గభాలున ఆగాడు. ఒక నిముషం ఆలోచించాడు. ఎడ్రసు ఇవ్వాలని లేదు. మళ్లీ ఏమనుకున్నాడో ఆమె ఇచ్చిన పెన్సిలు అందుకుని చిన్న కాగితంమీద తన స్కూలు అడ్రసు రాసిచ్చాడు. స్కూలుకువచ్చే ఉత్తరాలు తనకు చేరడానికి చాలా తక్కువ అవకాశాలున్నాయి.

## 5

శేఖరం పబ్లికు పరీక్ష ప్యాసయినాడు. మొత్తం మార్కుల్లో నూటికి యాభై పైగానే వచ్చాయి. అదేమంత పెద్దమార్కు కాదని తెలిసినాతోటి వాళ్లలో చాలా మందికి అంతకంటె చాలా తక్కువే వచ్చాయి కాబట్టి కొంచెం సంతోషంగానే ఉన్నాడు. మార్కులు చూడడానికి వెళ్లినప్పుడు చాక్‌పీసుల చెక్కపెట్టెలో పడేసి ఉంచే ఉత్తరాలు అరగేస్తున్న ఒకతను నలిగిపోయిన ఉత్తరమొకటి శేఖరం చేతికిచ్చాడు. కాపీయింగు పెన్సిలుతో రాసుంది. ఎన్ని రోజుల క్రితంవచ్చిందో తెలియదు. అడ్రసులో మాత్రం తన పేరు అస్పష్టంగా కనిపిస్తోంది.

అతనితా ఎవరో స్నేహితుడు రాసాడని చెప్పి గబగబా ఇంటికి పరిగెత్తి పెరట్లో స్నానాలగదిలో కూచుని జాగ్రత్తగా చూసాడు. కొంచెం సేపటికిగుండె వేగం మామూలుకంటె కూడా తగ్గింది - ఉత్తరంలో ఒక్క అక్షరం గూడా అర్థమవడం లేదు.

అంతలో ఏదో సాయంత్రం తుమ్మచెట్ల మధ్య ఉన్నట్లుంది. పొద్దు వాలకముందే పరిగెత్తాడు సీతానగరం. ఉత్తరంవచ్చి ఎన్నిరోజులైందో - ఇంకా ఉంటుందా ఇప్పుడు? అసలు ఉత్తరం రాసింది ఆమెకాదో. ఇంకా జ్ఞాపకమున్నానా అని.

మెల్లటిగాలికి అల్లల్లాడే అరటియాకులా ఊగిపోతోంది మనసు. శశి - శశేనా ఆమె? ఆమే నా శశి? - ఒక్క ఏడాది క్రితం తను చూచిన శశి - తోటలో నీళ్లుపోసే డబ్బాతో పూలచెట్లకి నీళ్లుపోస్తున్న అప్పన్నతో ఏదోమాట్లాడుతోంది. ఎంత ఎత్తు పెరి

గింది. తనకంటె ఎంతో పొట్టిగా ఉండేదికదూ? లావు మాత్రం?...

పక్కకి తిరగడంలో అట్లాగే రాపడి నిలుచుండి పోయిన అతడ్ని చూసింది శశి "ఓ! శేఖరం - రా" ఇద్దరూ లోపలివసారాలోకి వెళ్లారు. ఎంత నెమ్మది తనం నేర్చుకుంది. అచలాకీ - చిన్న పిల్లతనం అంతా ఎక్కడికి పోయింది?

వాళ్లమ్మగూడా అక్కడే కూచునుందివసారలో. ఇద్దరినీచూసి నవ్వుతూ లేచి "హమ్మయ్య ఇప్పటికి వచ్చావా? ఎన్నాళ్లైంది ఉత్తరం రాసి మీఅల్లుడికి ఎన్ని నెల్లున్నాయో - నీ ఉత్తరానికి అన్ని నెల్లున్నాయి." ఉయ్యాలలో గాలికి కొంచెంగా మెదులుతున్న దుప్పటివంక చూపించింది.

శేఖరానికి తాను అకస్మాత్తుగా పెరిగిపోతున్నట్టు తోచింది. ఆ ఇంటి కప్పును అందుకుంటున్నట్టు-ఆవసారాలో అవకాశాన్నంతా ఆక్రమించుకుంటున్నట్టు. మాట్లాడకుండా వింటున్నాడు. అదివరకు లాగే ఇద్దరినీ వదిలిపెట్టి వాళ్లమ్మ లోపలికి వెళ్లింది.

"ఎన్నాళ్లకి కలుసుకున్నామోయ్ శేఖరం?" శశి అంది కొంచెం సేపైనాక. ఎంతనంగనా చిలా మాట్లాడుతోంది? ఎంత స్నేహం - ఇన్నాళ్లూ ఏమైందో ఇదంతా.

తలవంచుకుని వింటున్న శేఖరం విసురుగా తలెత్తాడు. ఆమెకళ్లు అతనివంకచూస్తూ మెరుస్తున్నాయి. లేడి కళ్ళల్లో తొణికిసలాడే అమాయకత్వంతో. వీళ్లు మోసగాళ్ళు. ప్రకృతి తమకిచ్చిన ఈ అమాయకంగా కనిపించే అందమైన కళ్లతో ప్రపంచాన్నంతా వంచిస్తారు. లోకాన్నంతా కాశిస్తారు. తరంగాలు ఉవ్వెత్తుగా లేచాయి అతని హృదయసముద్రంలో - ఒక్కక్షణంలో ఆమెను మింగేద్దామన్నంత ఎత్తుకు. "అవును చాలా రోజులైంది?" సమాధానం చెప్పాడు

ఈ సారి తనేప్రశ్న వేయాలనుకున్నాడు "పెళ్ళికి నన్ను పిలవనైనాలేదేం?" కొంచెం కోపంగానే అడిగాడు. అందులో నాకు చెప్పకుండా అనేమాట తెర వెనుక ప్రతిధ్వనిస్తోంది. ఆమె ఏం సమాధానంచెప్తుందో వినాలని అతని ప్రతిరోమకూపమూ విస్తరించుకుని ఉన్నాయి.

ఆమె ఏదో గొణిగింది. కొంచెం వంగి కుచ్చెళ్ళు సర్దుకుంది. ఇంతలోకే వాళ్లమ్మ కేక వినిపించింది "అదుగో అమ్మ పిలుస్తోంది. ఏదీ ఫలహారం చేసినట్టుంది పద. "ఇప్పుడు ఏడాదిక్రితం శశికంఠం వినిపించింది శేఖరానికి. ప్లేట్లుబల్లమీద పెట్టుకొని ఫలహారంచేసారిద్దరూ. ఆమెతోపాటు అదివరకులాగానే నవ్వాలని ప్రయత్నించాను. అది తనకు అసాధ్యమనిపించింగి.

ఉయ్యాలవైపునుంచి ఏడుపువినిపించింది. తింటున్న పళ్లెం అక్కడ వదిలిపెట్టి శశిపరిగెత్తింది. ఉయ్యాల ఊపుతున్నా పడుపు ఆగలేదు. గుడ్డల దొంతరలోంచి ఒక చిన్న శరీరాన్ని వెలికితీసింది. "అంతా శశిపోలికే. అదే పెంకితనం. "వాళ్లమ్మ చెయ్యి కడుక్కునివచ్చి అందుకుంది. ఆమె వడిలో కూచుని ఏడుపుమానాడు." "ఇదుగోనోయ్! మీ అల్లుడు" శేఖరంవైపు తిప్పింది మొహం.

శేఖరం చూసాడు. ఇప్పుడు వీస్తున్న పెద్దగాలి మొదలునించి మొత్తం చెట్టునే ఊపేస్తోంది. ముందుకూ వెనక్కూ-ముందునూ-నిజంగానే శేఖరానికి తను ఊగుతున్నట్టనిపించింది.

ఏమైనా కానీ-వాడు శశికొడుకు పాపట దగ్గరగా వెళ్ళి బుగ్గలనులిమాడు ఆప్యాయతగా. మనసులో కళపెళలు కాసేపు తనకు తెలియకుండానే మరిచిపోయి. "ఎన్నో నెల" అడిగాడు. ఈ జీవగాలి పీల్చడం మొదలెట్టి రెండునెలలైందా అనుకున్నాడు సమాధానంవిని.

"అవునుగాని నువ్వుస్కూలు మార్చావేం? దూరమైపోవడంలే?" నిజమే చెప్పేయాలనుకున్నాడు. కాని "ఆ! ఏమీలేదు. ఇక్కడ పాఠాలు బాగా లేక చాలా మంది మంచిమంచి మాష్టర్లంతా వెళ్ళిపోయారు." అన్నాడు. కొంచెం సేపటివరకు స్కూలు సంగతులు మాట్లాడుకున్నారు. శశి మొగం కొంచెం వాడి ఉంది. నేను చదువు ఆపకుండా ఉంటే ఈపాటికి స్కూలు ఫైనల్ అయిపోయేదికదా అనేభావం ఆవిడబుఱ్ఱలో కదులుతోందని శేఖరం గ్రహించాడు. పెళ్ళేచేసుకోకుండా ఉంటే అంతా బాగానే ఉండేదిగా? తనలోనే అనుకున్నాడు.

ఒకగంట సేపైంది తనువచ్చి! ఇట్లా మైమురెక్కకోవడం ఇదే మొదటిసారి. "ఇంక వెళ్తాను శశి" అనే

టప్పుడు గొంతులో ఏదో అడ్డమొచ్చినట్టనిపించింది. "అప్పుడేనా?" అంది ఆమెకూడాలేచి. అదివరకులా బలవంతం చేయలేదు. వాళ్లమ్మకికూడాచెప్పి బయటికి వచ్చేసాడు. గేటు చేరుకునేదాక తిరిగి చూడలేదు. తను గేటు దాటిపోతుంటే శశి గుమ్మంలో నిలుచుని గడప కానుకుని చూస్తూండటం కనిపించింది.

ఇంకా చాలా పొద్దుంది! ఏం చేయాలో తోచ లేదు. నీళ్లల్లో తేలుతూ అలలతోపాటు ఊగుతూ ఒడ్డుకి కట్టబడిఉన్న ఒకటి కనిపించింది. అది అలల విసురుకి ఒడ్డుదగ్గరిగావచ్చిన సమయంచూసి అందులో దుమికి కూచున్నాడు. లోపల తెడ్లులేవు-దానికి చుక్కానీ ఉండదు! చీకటి పడేదాకా అతడు అందులో కూచుని ఆలోచించాడు. అది గాలికి దూరం కొట్టుకుపోయింది.

అయితే అతడు మనకు చెప్పదలచుకున్నది మాత్ర మొకటుంది-ఎప్పుడూ ఎవ్వరూ క్లాసులో అమ్మాయిని-అందులోనూ హైస్కూలు క్లాసులో అమ్మాయిని హృదయమిచ్చి ప్రేమించడంగాని ప్రేమించనివ్వడం గాని పొరపాటునైనా చేయగూడదు!

రెండేళ్లు కాలప్రవాహంలో కొట్టుకుపోయినాయి. శేఖరం సీనియరింటరు చదువుతున్నాడు. ఇన్నిరోజుల నుంచి లేనిబుద్ధి ఎందుకో ఆనాడు క్రిష్ణఒడ్డున కూచునుండగా కలిగింది. బంతిగిన్నెలాంటి కొండ-మేఘాల్ని అందుకోడానికి బాటలా ఆవలిఒడ్డున ఎత్తునపోతున్న రోడ్డు. తనకు సుపరిచితమైన సుందరదృశ్యాలు... అప్పుడే ఒడ్డుచేరుకున్న పెద్దచోటు మనుషుల్ని పశువుల్ని దింపుతోంది.

తోటలో పూలచెట్లులేవు. ఉన్నరెండు గూడింటికి కూడా పూలులేవు. గుండె భారమవుతోంది. అడుగు తరువాత అడుగుపడడమే కష్టమవుతోంది. పక్కగదిలోంచి వాళ్లమ్మ గొంతువినిపించింది "రావోయ్ శేఖరురా" చాప వెనక్కిలాగి ఏమిట వీపుమీదికి లాక్కుంది. కొంచెంసేపు కూర్చుని అడిగాడు..." అత్తారింట్లో ఉందో!" శశి అని వినబడేట్టు పలకలేక పోయాడు." మొన్ననే వచ్చింది లోపలుంది" ఇంకా ఎదో చెప్పుకుపోతోందామె.

సవ్వడివిని శశి ఇవతలికి వచ్చింది. అరె! ఎంత చిక్కిపోయింది. బుగ్గలు గుంటలుపడిఉన్నాయి. కళ్లు దించుకుపోయాయి. నడుము 'ఓ' అర్థంచేసుకున్నాడు శేఖరం! "ఓనువ్వా...అన్నందించిన వస్త్రానుండిప్పుడే" మళ్లీ గబగబాలోపలికి వెళ్లింది. "ఈ పూటక్కడే ఉంటాడులే శేఖరం. నువ్వేమీ తొందరపడబోక" అన్నది వాళ్లమ్మ, శేఖరం మాట్లాడలేదు. శశి మాట్లాడవలసిన అవసరం లేనంత దూరంనుంచి విన్నదది.

పనిమనిషి పిల్లవాడ్నెత్తుకుని లోపలికివచ్చింది. రెండేళ్ల కుఱ్ఱాడు గబగబా కిందికిదిగి ఆమె వంకకే పరుగెత్తుతున్నాడు "అ్న! అ్న! ఆగు ఆగు. అడుగో మామయ్య. అంటుపో" అంది ఆవిడ గాభరాపడి. వాడు కొత్త మనిషినిచూసి ఆగిపోయాడు.

శేఖరం మరి బావుండదని దగ్గిరికి పిలిచాను. వాడు కొంచెంసేపు అట్లాగే చూసి మెల్లిగా దగ్గిరికివచ్చి కుర్చీ కానుకుని నుంచున్నాడు. శేఖరం వాడివళ్లునిమిరాడు.

భోజనమైనాక చీకటిలోనే ఇంటికెవచ్చేసాడు. ఆ సాయంత్రం శశిని చూసినప్పటినించీ అతడి హృదయంలో పెద్ద సంక్షోభం బయలుదేరినట్లుంది. అది వరకటివి పొడిగాలిదుమారాలు. ఏదో ఒక వేపునించి మరొక వైపు కువిసిరేవి ఈకలవరంలో అన్ని వైపులనించీ అన్ని వైపుల కూవీస్తోంది బరువైన తడిగాలి. చెట్లను పడగొట్టుంది.పడిపోయిన చెట్లను వేళ్లతో సహానిలబెట్టుంది!

శశిలో తనకు తెలియకుండా; తనకు తెలిసి తను చూస్తుండగానే, కలిగిన పరిణామాలు...ఆమెతోపాటు తనుమారాడా? మారగలిగాడా? లేదు. ఇంకా తను నిక్కర్లేవేస్తున్నాడు. ఆమో? ఈలోపు ఆమెచాలా అవస్థలుమారింది. నిన్న - నిన్న వంట పొయ్యి దగ్గిర ముసలమ్మలు కట్టుకునే చీరకట్టింది. బుగ్గల్లో ఆగులాబిరంగులేదు - పెదవుల్లో ఆనాటి చిలిపిపట్టులేదు. ఆమెతోపాటు నేను మారలేకపోయాను. ఆమెతప్పేముంది? ఆమెను దోషిగా నిర్ణయించడానికి నాకు హక్కేముంది? నన్ను నేను సరిగా అర్థంచేసుకో లేకపోయాను - నన్ను నేను! ఇంతవరకూ హద్దులు తెలియని భూమిమీద బాటలేకుండా పరుగెత్తుతున్నాను.. ఆరాత్రంతా మేలుకునే పడుకున్నాడు.

మన్నాడు పొద్దున బజారు తగాలించాడు. అటు నించ శే పొట్లంచేత పట్టుకుని క్రిష్ణదాటాడు శేఖరాన్ని చూసి ఇద్దరూ చాలా ఆశ్చర్యపోయారు. శేఖరం చాలా సంతోషంగా ఉన్నాడు. "శశీ" స్పష్టంగా-నోరారాపిలిచాడు. ఒకసారికాదు సంభాషణలో వీలైనప్పుడల్లా.

చేతులో పొట్లం విప్పాడు. బిస్కట్ల టిన్నులు రెండు, బిళ్లల డబ్బాలు రెండు. శశి ఆశ్చర్యంతో చూస్తోంది. శేఖరం ఇంత తొందరగా మాట్లాడడం గాని ఏపనీ, అంత తొందరగా నవ్వుతూ చేయడంగాని ఎప్పుడూ లేదే? చిన్న పొట్లం విప్పాడు. ఆటవస్తువులు - చక్కటి ఆట బొమ్మలు రెండు - ఒకటి అంకెలు తిప్పే టెలిఫోను. రెండోది ముద్దొస్తున్న చిన్నస్టౌ.

కుఱ్ఱాడ్ని పిలిచి ఫోనుబొమ్మ ఇచ్చాడు. "శశీ!! ఇదిగో ఇది పుట్టబోయే మేనకోడలికి. అది స్టౌలమీదే వంటచేస్తుందిలే మీలా మసిపొయ్యిలమీద, కొంచెం మామూలు ధోరణిలోకొచ్చి. "కోడలు పుట్టేటప్పటికి నేనెక్కడుంటానో తెలియదు. అందుకని ముందుగానే ఇస్తున్నానిది. ఈ బీద మామయ్య అంతకంటె విలువగలిగినవేవీ ఇవ్వలేక పోయినా ఎప్పుడూ వాళ్ల మంచినే కోరుతాడని చేప్పు" కుఱ్ఱాడ్ని ఎత్తుకుని ఒకసారి పైకెగరేసి కిందికిదించాడు. వాడు చప్పట్లు చరుస్తున్నాడు నవ్వుతూ.

శశీ కేమీ అర్థంకాలే గుమ్మదిగి వెళ్లొస్తా చెల్లి!" ఆమె పట్టుకుని చెప్పాడు. ఆమె తొట్రుపడిందిగాని అతడు తొణకలేదు. తిరిగిచూస్తూ ఉల్లాసంగా వెళ్లి పోయాడు. "చాలా విచిత్రమైన మనిషి" విభ్రమం పట్టలేక పోతున్న వాళ్లమ్మ అందిలోపల్నుంచి. నిజంగానే.. అనుకుంది శశి మనసులో - కొద్ది కొద్దిగా అర్థచేసుకుంటూ

శేఖరం మళ్లి ఎప్పుడూ వెళ్లలేదు వాళ్లింటికి, శశిమీద తన ఆ అభిప్రాయం అట్లాగే ఉండాలని అతనికోరిక!


వేప్రిన్

దెబ్బలు, కురుపు, తామర, ఎక్జిమా, గజ్జి, సుఖవ్యాధులవలన కలిగిన పుండ్లు, తేలుకుట్టు, మూల శంఖ, కాల్పులు మొదలైనవాటిని అద్భుతంగా నివారణచేస్తుంది. కొత్త చర్మం త్వరగా వచ్చేటందుకు సహాయ పడుతుంది. ప్రతి ఇంటా తప్పనిసరిగా డాక్టరులా వుండితీరాల్సిన ఔషధం.

¼ ఔ. సీసా అణాలు 9. ½ ఔ. సీసా రు. 1.

హాత్రిన

అతిసారానికి; జిగట, రక్తవిరోచనాలకి
అద్భుతమైన ఔషధం.

అతిసారం, జిగట, రక్తవిరోచనాలు, వాంతులు, జబ్బువల్ల వచ్చిన జ్వరం వీటిని తగ్గించును.
అసాధ్యమైన జబ్బులన్నీ ఈ మందుకి
సాధ్యమౌతాయి.

6 మాత్రలు గల పేకట్ 6 అణాలు.

క్యాప్సినాల్

దగ్గు, రొంపల్ని అశ్రద్ధగా చూడకండి,
ఎందుకంటే ఊపిరితిత్తులలో రకరకాల వ్యాధుల్ని తీసుకొస్తుంది. అలా రాకుండా 'క్యాప్సినాల్' సహాయపడుతుంది.

దగ్గులు, రొంపలు, ఇన్ఫ్లుయన్జా మొదలైన వ్యాధుల్ని నివారణచేస్తుంది.

6 మాత్రలు గల పేకట్టు 4 అణాలు.
4 ప్యాకట్లకు తక్కువ వి. పి. లో పంపబడదు.

అన్ని షాపులలో దొరకును.

ధి లస్టర్ మ్యానుఫాక్చరింగ్ కంపెని,
చిక్‌పేట, బెంగుళూరు సిటీ.